కనుల పండువగా శ్రీవారి కల్యాణం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


కల్యాణ ఉత్సవ మూర్తులు

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- రాజంపేటలో ఎటుచూసినా భక్తుల సందడి

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో శనివారం రాత్రి శ్రీవారి భక్తసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. టీటీడీకి చెందిన వేదపండితులు వేద మంత్రోచ్ఛారణలతో స్వామివారి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపించారు. కల్యాణం జరుగుతున్నంతసేపు భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వ భావనలో ఉండిపోయారు. కల్యాణ ప్రాంగణం గోవిందనామ స్మరణతో హోరెత్తింది. రాజంపేట పట్టణం నుంచే కాక వివిధ గ్రామాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. నిర్వాహకులు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి భక్తులు బయట నుంచి స్వామివారి కల్యాణం తిలకించే ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు వేలాది మంది భక్తులు తరలి రావడంతో పట్టణంలో ఎటుచూసినా శ్రీవారి భక్తుల సందడి కనిపించింది. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి భక్తసేవా సమితి ప్రతినిధులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కల్యాణం ప్రారంభోత్సవానికి ముందు గీతాపారాయణం, విష్ణు సహస్రనామం, అన్నమయ్య సంకీర్తనలు, కోలాటం, కూచిపూడి నృత్యం కార్యక్రమాలను నిర్వహించారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

సుండుపల్లె : మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీలు ఉన్నచోట కార్యకర్తలు, ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీఓ సుగుణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మసముద్రం పంచాయతీ దిగువ పల్లికి జనరల్, మండల కేంద్రంలోని వినాయక్ నగర్‌లో ఆయా నియామకానికి ఈడబ్ల్యుఎస్, చిన్న గొల్లపల్లి ఆయా పోస్టుకు జనరల్, మన్యంవారిపల్లి ఆయా పోస్టుకు ఎస్టీలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనవరి 2వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీ వెంకటేశ్వరులు

సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లెలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

సైన్స్ ఫెయిర్‌లో అన్ని పాఠశాలలు పాల్గొనాలి

లక్కిరెడ్డిపల్లి : ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చక్రేనాయక్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ తెలిపారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ప్రాజెక్టులను మండల స్థాయిలో నిర్వహించి అత్యుత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు పంపిస్తామన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం


గువ్వలచెరువులో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రామాపురం : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం, గువ్వలచెరువు ప్రాంతాలలో శనివారం పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, పార్టీల కార్యకర్తలు, మహిళలు, ప్రజలు స్వాగతం పలికారు. భారీ కాన్వయతో కడప నుంచి గాలివీడుకు వెళ్తున్న పవన్ కల్యాణ్ ప్రజలను చూసి కాన్వాయ్‌ని ఆపారు. ప్రజలకు అభివాదం చేసి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

రెడ్డిపల్లిలో రెవెన్యూ సదస్సు


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మొత్తం 53 అర్జీలు అందాయని, భూములకు సంబంధించి 39, రేషన్ కార్డుకు 1, నూతన పింఛన్ల కోసం 8, వ్యవసాయానికి సంబంధించి 2, ఇంటి పట్టాకోసం 3 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీరాములు, వీఆర్‌ఓ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

లక్కిరెడ్డిపల్లి : శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి వెంకటకృష్ణారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలలో పాఠశాలకు చెందిన కె.అమృత హిందీలో వంద మార్కులకు గాను 93 మార్కులు సాధించినందుకు హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ భవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు


సిద్దవటం : శనీశ్వరస్వామికి తైలాభిషేకం పూజలు చేస్తున్న భక్తులు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలోని మందగిరి శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సిద్దవటం సుబ్రమణ్యం స్వామి మాట్లాడుతూ స్వామి వారికి గణపతిపూజ, కలశ స్థాపన, పుణ్యాహవాచనం, క్షీరాభిషేకం, తైలాభిషేకం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి తైలాభిషేకం పూజలు నిర్వహించారు.

రామాపురం : శని త్రయోదశి సందర్భంగా శనివారం మండలంలోని పలు ఆలయాల్లో శనీశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. నీలకంఠ్రావుపేట, గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులోని భవానీ శంకర ఉమామహేశ్వర ఆలయం, హసనాపురంలోని మూలస్థానేశ్వర ఆలయం, కంభరాయుడి గుట్టపై గల నవగ్రహ మంటపం, హరిహర ఆలయంలో శనీశ్వరుడికి తైలాభిషేక పూజలు, నివేదనలు చేశారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ రైల్వే ఆవరణలో వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా ఆలయ అర్చకులు సరసా రవికుమార్ శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని శనీశ్వరుని విగ్రహానికి తైలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈద్గా రహదారిలో కట్టడాలు తొలగించాలి


ఈద్గా మైదానం వద్ద మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకుడు సయ్యద్ జవహర్ బాషా

సిద్దవటం : సిద్దవటం రెవెన్యూ సర్వే నంబర్ 21లో ముస్లింలు పండుగల సమయంలో ప్రార్థలకు ఈద్గాకు వెళ్లే రహదారిలో కట్టడాలను నిర్మించడంపై శనివారం ముస్లిం మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సయ్యద్ జవహర్‌బాషా మాట్లాడుతూ సర్వే నంబర్ 410 నుంచి సర్వే నంబర్ 21 వరకు బండ్ల బాటగా రెవెన్యూ రికార్డుల్లో గుర్తించారన్నారు. సిద్దవటం గ్రామ శివారులోని ఈద్గా మైదానానికి వెళ్లే రహదారికి అడ్డంగా ఉన్న కట్టడాను వెంటనే తొలగించాలని కోరారు. ఈ రహదారి విషయమై సీఎంఓ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న రైతు


అర్జీలను స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

ఓబులవారిపల్లె : తన తండ్రి డేగల చెంగయ్య పేరుపై ఉన్న పట్టా భూమిని ఇతరుల పేరుపై అక్రమంగా ఆన్‌లైన్ చేశారని, న్యాయం చేయాలని రైతు డేగల విజయ్ కుమార్ రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతి పత్రం అందజేశారు. శనివారం గాదెల పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాదెల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 138–2ఏలో 1.50 సెంట్లు డేగల గంగోజమ్మ పేరుపై అక్రమంగా ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీడీఓ మల్ రెడ్డి, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు


సుండుపల్లె : మండల పరిధిలోని సొంతంవారిపల్లి గ్రామ సచివాలయంలో శనివారం గ్రామ రెవెన్యూ సదస్సును మండల ప్రత్యేక నోడల్ అధికారి జయరాముడు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సభకు 49 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్‌ఓ రమణ, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మండల స్థాయిలో సైన్స్‌ఫేర్ పోటీలు


సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫేర్

సిద్దవటం : సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి సైన్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎంఈఓ విలియం రాజు, పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గైడ్ టీచర్ రామలింగరాజు, లక్ష్మిప్రసన్న, భువనశ్రీ అనే విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారన్నారు. వీరు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. వ్యక్తి గత పోటీల్లో వెంకటేశ్వరపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన కె. సుధ అనే విద్యార్థిని జిల్లా పోటీలకు ఎంపికైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవరి 5న ప్రసన్న రంగనాథస్వామి కల్యాణం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నందలూరు : రాజంపేట పట్టణంలోని తోట కల్యాణ మండపంలో రాజంపేట తిరుప్పావై భక్త సేవాసమితి ఆధ్వర్యంలో జనవరి నెల 5వ తేదీన గోదాదేవీ, మహాలక్ష్మీదేవి సమేత ప్రసన్న రంగనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన సౌమ్యనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

విద్యా సామగ్రి వితరణ

వీరబల్లి : గడికోట గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి గూటం ప్రతాప్, ప్రసన్న కుమారిలు శనివారం గ్రామంలోని యడబల్లి ఎంపీపీ స్కూల్, పీరయ్యగారిపల్లిలోని అంగన్ వాడీ సెంటర్‌లో విద్యార్థులకు పెన్సిళ్లు, పెన్నులు, కాపీరైటింగ్ పుస్తకాలు, లెక్కల పుస్తకం, రైటింగ్ ప్యాడ్, స్కేల్ క్రేయాన్స్, డ్రాయింగ్ పుస్తకాలు పంపిణీ చేశారు. హెడ్మాస్టర్ ఎం హనుమంత్, ఉపాధ్యాయుడు సురేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర రవి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఓబులేశు, అంగన్‌వాడీ టీచర్ సుప్రియ, గణేష్, శివ, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా ముక్కా రూపేష్ కుమార్ రెడ్డి


రూపేష్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఓబులవారిపల్లె : బీజేపీ మండల అధ్యక్షునిగా ముక్కా రూపేష్ కుమార్ రెడ్డిని ఎన్నుకున్నారు. బొమ్మవరం గ్రామంలో నిర్వహించిన మండల బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బీజేపీ నాయకుడు చెంగల్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం చెంగల్ రాజు, పులపుత్తూరు రామ సుబ్బారెడ్డి, కోటి తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ స్థలం కబ్జా


బస్సు షెల్టర్ స్థలాన్ని కబ్జా చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌కు సంబంధించిన స్థలాన్ని యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. మంగంపల్లి నుంచి చిట్వేలి–రైల్వేకోడూరు వెళ్లే మార్గంలో మారేపల్లి క్రాస్ రోడ్డు వద్ద దశాబ్దాల క్రితం బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు బస్సు షెల్టర్ పక్కనే ఉన్న భూమిని చదును చేసి శనివారం కంచెను ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేశారు. సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ నాయకులతో కలిసి బస్సు షెల్టర్ స్థలం కబ్జాను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు స్పందించి అడ్డుకోకపోతే నిరసన చేపడతామన్నారు.

అట్రాసిటీ కేసుల విచారణలో నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న పాలకుంట శ్రీనివాసులు

పీలేరురూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో నిర్లక్ష్యం తగదని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణికుమార్ అన్నారు. స్థానిక బాస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కలకడ మండలం ఏనుగొండ పాళ్యం పంచాయతీ బండమీదపల్లె ఎస్సీ కాలనీకి చెందిన యాకల రెడ్డెప్పపై అదే గ్రామంలోని అగ్రవర్ణ కులానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తీవ్ర పరుష పదజాలంతో దూషించడం తగదన్నారు. ఈ నెల 19న దాడికి పాల్పడిన మహేష్ నాయుడు, ప్రసాద్ నాయుడు, వీరాంజనేయులునాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసి పది రోజులైనా ఇంత వరకు బాధితుడి కుటుంబాన్ని విచారించలేదన్నారు. పోలీస్ అధికారులు బాధితుడికి రక్షణ కల్పించడం తోపాటు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగ అవకాశాలను చేజార్చుకోవద్దు

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను చేజార్చుకోకుండా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక కాకతీయ విద్యా సంస్థల ఆడిటోరియంలో శనివారం ఆకేపాటి ఆధ్వర్యంలో ఎల్‌అండ్‌టీ సంస్థ జాబ్‌మేళాను నిర్వహించింది. జాబ్‌మేళాను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే సమయం వృథా చేయకుండా ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఎక్కడ ఉద్యోగం దొరికినా మరో ఆలోచన లేకుండా ఆ ఉద్యోగంలో చేరాలన్నారు. ప్రారంభ దశలో తక్కువ వేతనం ఉంటుందని, ఆ సమయంలో వేతనం గురించి ఆలోచించకుండా ఉద్యోగంలో చేరితే అనుభవం ద్వారా వేతనం పెరుగుతుందన్నారు. పిన్న వయస్సులో ఉద్యోగం వస్తే భవిష్యత్తు కూడా బాగుంటుందని తెలిపారు. ఉద్యోగం ఉంటే సమాజంలో గౌరవ, మర్యాదలు కూడా పెరుగుతాయన్నారు. చాలా మంది తమ చదువుకు తగ్గ వేతనం లేకుంటే ఉద్యోగంలో చేరకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని అది ఏమాత్రం సరైనది కాదన్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ రాజంపేటలో జాబ్‌మేళాను నిర్వహించి ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆకేపాటి, పోలా చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఇన్‌చార్జి జి.శంకరయ్య, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు కాంతారావు, ధరణి నటరాజన్, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు సౌమిత్రి, దండు గోపి, దాసరి పెంచలయ్య, మలిశెట్టి శ్రీనివాసులు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధ పదవులను అపహాస్యం చేయొద్దు


మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

రాయచోటి అర్బన్ : రాజ్యాంగబద్ధ పదవులను అపహాస్యం చేసేలా కొందరు వ్యవహరించడం తగదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరమణ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి కేంద్రంలో అధికారులను ఆఫీసులలోనూ, ఉపాధ్యాయులను క్లాస్ రూములలో రౌడీషీటర్లు గాయపరచడం, చంపేస్తుండడం దారుణమన్నారు. ఇదే సమయంలో మహిళా ప్రజాప్రతినిధులను చాలావరకు వారి కుటుంబీకులే వంటింటికి పరిమితం చేస్తూ వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తుండడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే వారిని ప్రభుత్వం జిల్లా బహిష్క రణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాధవయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు శివ శంకర్, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ నాగరాజు

చిన్నమండెం : విధాన్ సే సమాధాన్ జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో చిన్నమండెం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శనివారం బ్లాక్ స్థాయిలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు నాగేశ్వరరావు, నాగరాజు గృహహింస, వరకట్న వేధింపులు, మహిళల పట్ల క్రూరత్వం, లైంగిక వేధింపులు, అపహరణ, యాసిడ్ దాడి, అత్యాచారం, గ్యాంగ్‌రేప్, మహిళలకు సమాన పనికి సమాన వేతనం, సమాన వేతన చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం ఎంపీడీఓ శేఖర్‌నాయక్, ఏపీఎం రెడ్డమ్మ, ఏపీఓ మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, మండల స్థాయి మహిళా ఉద్యోగులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

కొత్తమాధవరంలో మండల స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన


ప్రాజెక్టులను తిలకిస్తున్న విద్యాశాఖాధికారి డి.ప్రభాకర్

ఒంటిమిట్ట : కొత్తమాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్.నాగలక్ష్మీ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట మండల స్థాయి ఎస్‌ఐఎస్‌ఎఫ్–2025 పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంటిమిట్ట మండల విద్యాశాఖాధికారి డి. ప్రభాకర్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 42 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులతో హాజరయ్యారన్నారు. వ్యక్తిగత ప్రాజెక్టులలో మొదటి బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తమాధవరం విద్యార్థి ఎస్‌వి కార్తీక్ గెలుచుకోగా, ద్వితీయ స్థానంలో మాధవరం ఏపీఎస్‌కు చెందిన జి.గౌతమి, తృతీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ మంటపంపల్లికి చెందిన పి.అభిషేక్ నిలిచారు. గ్రూప్ యాక్టివిటీస్‌లో జెడ్పీహెచ్‌ఎస్ ఒంటిమిట్టకు చెందిన టి.శివ కార్తీక్, ఫయాజ్ ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ మాధవరానికి చెందిన ఎస్.సాయి మహేష్, తృతీయ స్థానంలో ఎస్‌ఎస్‌వై ఎస్.కొత్త మాధవరానికి చెందిన ఎస్.కీర్తి నిలిచారన్నారు. ఉపాధ్యాయుల ప్రాజెక్టులో జిల్లా పరిషత్ కొత్త మాధవరం పాఠశాలకు చెందిన సోషల్ ఉపాధ్యాయుడు ఎస్.షహ జమీర్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, కొత్తమాధవరం పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు టీచర్‌కు ఆకేపాటి నివాళి


నివాళులర్పిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ కాడే రామయ్య మృతదేహం వద్ద శనివారం రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి నివాళులు అర్పించారు. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, నాయకులు కాడే రమణయ్య, ఏకుల వెంకట్రామిరెడ్డి, కె. చిన్నసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటి పరామర్శ

రాజంపేట టౌన్ : అనారోగ్యం కారణంగా హాస్పిటల్‌లో వైద్యం పొంది స్వగృహానికి చేరుకున్న అమ్మవారిశాల ప్రధాన అర్చకులు సుబ్బరాయుడు స్వామి, న్యాయవాది కరుణాకర్‌రాజును శనివారం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్ సనిశెట్టి నవీన్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు సౌమిత్రి, బింగిహరి, రమేష్, దండు గోపి, దాసరి పెంచలయ్య, చికెన్ శీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


కడప నగరానికి చేరుకున్న స్వర్ణోత్సవాల ప్రచార జాత

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాకినాడలో జరగబోవు స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. శనివారం మహాసభలకు సంబంధించిన ప్రచార జాత కార్యక్రమం కడప జిల్లాలో జమ్మలమడుగు నుండి ప్రారంభమై ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్ మీదుగా కడపకు చేరుకుంది. కడపలో వై జంక్షన్ వద్ద ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. అక్కడి నుండి బాలాజీ నగర్‌లోని యూటీఎఫ్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి జిల్లా కార్యాలయంలో స్వర్ణోత్సవ జాత ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఒక చారిత్రక అవసరంతో ఆవిర్భవించిన యూటీఎఫ్ 50 సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యారంగంలోను, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ప్రచార జాతాకు మద్దతుగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.మనోహర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, ఎల్ఐసి ఉద్యోగుల నాయకులు రఘునాథరెడ్డి, ఏపీజీబీ బ్యాంక్ ఉద్యోగుల నాయకులు జగదీశ్వర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.